# చదువు

"తులసి వనం ముందు పిచ్చిమొక్కల్లా, అందాల ఆఫీసు భవనం ముందు ఈ ఆకుల గుడిసెలేమిటీ? వీటిని పీకేయించాలి"

పల్లెల అభివృద్ధి కోసం పట్టణంలో ఏర్పాటైన ప్రాజెక్టు ఆఫీసులో అప్పుడే అడుగు పెడుతూ వెంకటేశం తన సబార్డినేట్ నాదేశించాడు. సూటు, బూటు నేపథ్యంలోంచి తన్నుకొస్తున్న అధికారోత్సాహం ఆఫీసు పరిసరాలను పర్యవేక్షిస్తోంది. అంతదాకా ఐఎఎస్ శిక్షణలో గడిపి ఆ రోజే ప్రాజెక్టాఫీసర్‌గా జాయినయ్యాడు. వరండా నిండా పరుచుకున్న నీరెండ నిండు పున్నమి వెన్నెలలా కనబడుతోంది. అడుగులు ఠీవిగా పడుతు న్నాయి.

ఆఫీసు మేనేజరు అప్పలస్వామి భయభక్తులతో పక్కన నడుస్తూ దారి చూపిస్తున్నాడు. సీనియర్ ఉద్యోగులు వెంటున్నారు. తొలకరి చినుకు రాలగానే ముడుచుకు పోతున్న స్వాతిముత్యం చిప్పల్లా, ఆఫీసర్ నోటినుండి వెలువడిప మాటలు పియ్యే నోటుబుక్కులో కెక్కిపోతున్నాయి. రాజు వెడలె రవితేజము లలరగ...అన్నట్టు వుందా దృశ్యం

పట్టుపుట్టాల రాకుమారి ముందు చిరుగు చీరెల చెలికత్తెల్లా...అధునాతన భవనం ముందు అన్ని గలీజు గుడిశెలా? వెంకటేశం భావావేశం వెన్నంటి తరుముతోంది.

"నోటు చేసుకున్నారా?" చాంబర్లో ప్రవేశిస్తూ పియ్యే నడిగాడు.

"యస్సర్"

చాంబర్ గది గోడలకు తైలవర్ణ చిత్రాలు, పల్లెపడతుల సహజ సౌందర్యాలు, ప్రకృతి దృశ్యాలు, సూపర్. మనసునిండా మల్లెలు విచ్చుకున్నాయి. ఖరీదైన కుర్చీ స్వాగతం పలికింది.

ప్రాజెక్టు కంట్రాక్టర్ల పూలదండలు, సబ్‌కాంట్రాక్టర్ల మురిపాల మోములు, మెటీరియల్ సప్లైదార్ల పొగడ్తలు కృత్రిమంగా గోచరించినా థ్రిల్లింగ్‌గా వుంది. మధ్యాహ్నం దాకా అదే హంగామా.

"కంట్రాక్టర్ కామేశం మిమ్ముల్ని లంచ్‌కాహ్వానిస్తున్నారు సార్" చంకలో ఫైలుతో చేతులు కట్టుకుని కళ్లతో కామేశంను చూపించాడు అప్పలస్వామి.

"కొత్త ఆఫీసరెవరొచ్చినా మొదట కామేశంగారి అతిథ్యాన్నే స్వీకరిస్తారు. సార్" పియ్యే మొహం అలా విచ్చుకుని ఇలా ముడుచుకుని క్వొశ్చెన్ మార్కులాగైంది.

"నో... హోటల్ నుండి కారేజీ తెప్పించుకుంటాను."

అప్పలస్వామి గుండె ఝల్లుమంది. కామేశం మొహం అప్పుడే ఆరిపోయిన అగరొత్తిలాగైంది. కంట్రాక్టర్లు చెవులు కొరుక్కుంటున్నారు. సబ్‌కాంట్రాక్టర్ల బుర్రల్లో సవాలక్ష సందేహాలు దోబూచులాడుతున్నాయి. మెటీరియల్ సప్లైదార్లు జుట్టు పీక్కున్నారు. ఆఫీసు స్టాఫు మొహాలు చూసుకుని ఆలోచనలో పడిపోయారు. ఇప్పటిదాకా ఆఫీసు స్టాఫంతా

పిల్లులై!, తననో పులిలా భావించుకున్న అప్పలస్వామి పిల్లిలా అడుగులేస్తూ బయటికొచ్చాడు. చంకలో వున్న ఫైలును టేబుల్ మీద పడేసి కుర్చీలో కూలబడ్డాడు. చేతుల్ని తలకు చుట్టుకుని వెనక్కు జేరగిల బడ్డాడు. చూపులు సీలింగ్ ఫ్యానుమీద సెటిలైపోయినై. ఆఫీసు స్టాఫు అదోలా చూస్తూ తమ తమ సీట్లో కెళ్లిపోతున్నారు. అతని సన్నిహితులు అక్కడే ఉండిపోయారు.

"ఇదేమిటి సార్, కొత్త ఆఫీసర్ గారట్లా అన్నారేందీ?"

"హబ్బ! కామేశం భోజనం ఎంత హైక్లాసుగుంటుందో! ఆ రుచి, పచి ఈయన గారికేం దెల్సురా"

"ప్చ్! ఆఫీసర్ వెంట మన మంతా వెళ్లేవాళ్లం గదా" గుస గుసలు రుసరుసలు... వ్యాఖ్యానాలు, మూతి విరుపులు.

"కొత్తగా వచ్చిన ఐఏఎస్‌లు ముందిట్లానే వుంటారు. రానురాను మనలో ఒకరై నలుగురితో నారాయణా అంటారు సామీ!" అప్పలస్వామి సర్దుక్కూచుని సర్దిచెబుతున్నాడు. "నా సర్వీసులో ఇలాంటి వాళ్లనెందర్ని చూళ్లేదూ" లోలోపల కప్పల తక్కెడలా కదుల్తున్న అనుమానం బయటపడకుండా జాగ్రత్తపడుతున్నాడు.

పుల్లూరు బండ జాతరలాగున్న వాతావరణం పూర్తిగా ప్రశాంతమైంది. వెంకటేశం ఊపిరి పీల్చుకున్నాడు. కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. అటెండర్ చేతిలో యాభైరూపాయల నోటు ఉంచి "ఓ శాకాహార భోజనం కారేజీలో పట్రా" అనేశాడు.

అటెండరు నటు పంపించి ఇటు విశ్రాంతి గదివైపు నడుస్తున్నాడు. తనకోసమే నలుగురు... చిల్లుల చొక్కాలు, పొట్టి నిక్కర్లు, మాసిన మీసాలు, పెరిగిన గెడ్డాలతో ఎదురుచూస్తున్నారు.

రౌడీలు కాదుకదా! ప్రాణం గతుక్కుమంది. ఇప్పుడెట్లా...

"దండాలయ్యా!" కోరస్ గొంతులతో చేతులు జోడించారు.

ఇదో నటన కాదుగదా.... వెన్నుపూసలో సన్ననివణుకు.

"ఆ...ఆ...నమస్తే" కాళ్లకు బ్రేకులు పడినై "మీరెవరు?"

"మేము గా గుడిశెలోల్లమయ్యా" అంటూ వయసు మళ్లినాయన తలవంచుకున్నాడు.

మిగతా ముగ్గురు ఆశగా చూస్తున్నారు.

"ఆ అయితే!" లోలోపల బుసబుస.

"మా గుడిశెల్ని పీకెయ్యమన్నారటా" యువకుడు నెత్తి గోక్కున్నాడు. కళ్లల్లో... అది దైన్యమో లేక ధైర్యమో.

"అవును. ఆ జాగా గవర్నమెంటుది గదా" కొద్ది పాటి గాంభీర్యం జవాబిచ్చింది.

"నిజమే... కానీ... మేము బీదోల్లమయ్యా. దిక్కు లే నోల్లం. ఇల్లూ ముంగిలి లేనోల్లం సారూ. గుడిశెలు పీకేస్తే దిక్కులేని పిట్టలోలె ఆగమై పోతమయ్యా" నడివయ సాయన నమస్కరించాడు.

అది బతిమిలాటనో, బెదిరింపో... అంతా గందరగోళం.

"అయితే గవర్నమెంటు జాగా నాక్రమిస్తారా?"

"వేరే జాగా లేదు దొరా, ఏదో కూలీనాలీ చేసి పొట్టబోసుకుంటున్నం దొరా" చూపులో నిజాయితీ.

"మా పెండ్లాం, పిల్లలు జబార్ల పడ్తరయ్యా" అవేదన.

అభ్యర్థనలు, దీనవచనాలు గుండెల్ని తడుతున్నాయి.

"జెర దయ చెయ్యింఢ్రయ్యా. మా గుడిశెలనట్లానే ఉండనియ్యండ్రయ్యా. దిక్కులే నోల్లం. మీకు పుణ్యముంటుంది. దొరా!" వయసు మళ్లినాయన మరోసారి చేతులు జోడించాడు. వెంకటేశం పొత్తికడుపు పేగులో కలుక్కు మంది ఉద్యోగ ధర్మం గుర్తుకొచ్చింది.

"ప్చ్...." ఆకలి ముందుకు నడిపించింది. నాలుగు మొహాలు నల్లబడ్డాయి.

ప్రభుత్వం ఆస్తులంటే అందరికీ అలుసే. ఎక్కడ పడితే అక్కడ అట్లా ఆక్రమించు కుంటూ పోతే ఎట్లా? ఆఫీసర్ ఆలోచన.

కాళ్లూ చేతులు కడుక్కునేసరికి కారేజీ వచ్చేసింది.

టేబుల్ మీద గ్లాసు, నీళ్ల జగ్గు, ప్లేటు... అన్నీ ఉన్నాయి., కారేజీ పక్కన చిల్లర డబ్బులున్నాయి.

"వడ్డించాల్నా సార్!" సవినయంగా అడిగాడు అటెండర్.

"నువ్వెళ్లు. నేను వడ్డించుకుంటా"

కారేజి విప్పుకుంది. వంటకాలు ఘుమఘుమలాడుతున్నాయి. పప్పు, వేపుడు కూర, చారు, గడ్డపెరుగు.. భోజనం తృప్తిగా వుంది. పడకుర్చీ పవళింపుకు పిలిచింది. మానసిక విశ్రాంతి మనోనిబ్బరానికి బలమిస్తోంది. సీలింగ్ ఫ్యాను గాలి ఒంటిని ప్రేమగా స్పర్శిస్తోంది. అంతరాళాల్లో గతం దృశ్యాలు తచ్చాడుతున్నాయి.

అమ్మ ఒడి, వీధి బడి, అమ్మవారి గుడి... స్వేచ్ఛా విహంగములా తిరిగిన రోజులు.. మరుపురాని కాలమది.

జీవన పోరాటంలో ఆశల హంగామాకు గిరిగీసిన పరిస్థితుల్లో నాన్న రైసుమిల్లు గుమాస్తా. పట్టణ వాసము. రాత్రింబవళ్లు కుట్టుమిషన్‌తో ఉచ్ఛ్వాస-విశ్వాసలు పంచుకుంటున్న అమ్మ....పాపం! అమాయకురాలు. తాను, తమ్ముడు ఒకే బడికెళ్లేవారు.

అమ్మానాన్నల దీక్షకు స్కాలర్‌షిప్‌తో సాగిన చదువు. హైస్కూల్లో లెఖ్ఖల మాస్టారు జీవితమనే అంకగణితంలో అంకెల గారడీకి అంకితమైన నిష్ఠాగరిష్టుడు. పాఠమంటే ఆయనకు ప్రాణం. ఓ రోజు ఆయన

"ప్రయత్నం, పట్టుదల ఉంటే దేన్నైనా సాధించవచ్చు. పరువు ప్రతిష్ఠల జోలికి పోకుండా ఆత్మవిశ్వాసంతో స్టెప్పులు పడుతుంటే అరమరికలు లేకుండా గమ్యం చేరుకోవచ్చు. సరియైన అవగాహనతో తప్పిన స్టెప్పులను సరిజేసుకుంటే ఏ లెక్కా తప్పుబోదు..." చెప్పిన పాఠం మనసు తెర మీద ముద్రించుకు పోయింది. మాటలు కావవి... అక్షర సత్యాలని రుజువై పోయినై.

కాలేజిలో తెలుగు మాస్టారైతే సమయ సందర్భాలననుసరించి జీవిత పాఠాలు చెప్పేవారు.

"చదువంటే కేవలం అక్షర జ్ఞానమే కాదు. ముక్కుమీద మూడు ముక్కలు మోస్తూ పరీక్షలు రాసి పాసవడం కాదు. సమకాలీన సమాజం పోకడలు, తోటి మనుషుల మనస్తత్వాల అవగాహన, అన్ని వర్గాల జీవితాల సర్థం చేసుకుని అసలైన పౌరుడిగా మసలడం. లోకజ్ఞానాన్ని మించిన చదువు లేదు. నిజాయితీని మించిన సంస్కారం లేదు"... అవన్నీ ఏరిన ముత్యాలే.

డొనేషన్ కట్టే తాహతు లేక ఇంజనీరింగ్‌లో చేరనందుకు మనసు ఆక్రోశించలేదు కానీ పి.జి.పూర్తయ్యాక నిజజీవితంలో తోటి మనుషుల ప్రవర్తన, ప్రతిరంగంలో పోటీ తత్వం కులాల ప్రాతిపదికన ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్లు.. అతలాకుతలం చేశాయి. దాన్నే ఛాలెంజిగా తీసుకుని రాత్రి-పగలుతో పోటి పడుతూ చదవాల్సి వచ్చింది. మిత్రులు "వీడో పుస్తకాల పరుగు" అన్నా. "ఈ పిల్లగాడు ఆడపిల్ల లెక్క ఇంట్లనే కూకుంటడు. ఓ ఆటలేదు-పాటలేదు" అని ఇరుగు పొరుగు పెద్దమనుషులు మొహమ్మీద్ద అనేసినా దులిపేసుకోక తప్పలేదు.

"లోకం పోకడ గట్టనే ఉంటదిరా" తన మానసిక స్థితినెరిగిన నాన్న కర్మసిద్ధాంతాన్ని నూరిపోసేవాడు.

తెల్లవారకముందే పుస్తకం ముందేసుకు కూచున్న తన గుండె చప్పుళ్లకు అమ్మ కుట్టుమిషన్ శబ్దం తాళం వేసుండేది. కన్నతల్లి అమృత హస్తాలతో అందించిన వేడి చాయ్.. ఐఏఎస్ ప్రిలిమినరీలో ర్యాంకు ఇప్పించింది. అదే ఆత్మవిశ్వాసం మెయిన్స్‌లో సెలక్షన్‌కు దారి చూపించింది. చర్మం ఒలిచి అమ్మానాన్నలకు చెప్పులు కుట్టించినా ఋణం తీరదు. అందుకే అన్నారేమో... మాతృదేవోభవ, పితృదేవోభవ...

"సార్!" అటెండర్ పిలుపు. "మీకోసం పత్రికలోల్లు వచ్చిండ్రుసార్"

"వస్తున్నా పద" తయారై బయటికొచ్చాడు.

అడుగులు చాంబర్ వైపు పడుతున్నాయి. దృష్టి గేటు వైపు మళ్లింది. గేటు లోపల, ప్రహరీగోడ నానుకుని కొమ్మలు, రెమ్మలుగా విస్తరించిన వేపచెట్టు.. పచ్చని పీతాంబరం కట్టుకున్న ఆడపడుచులా గుంది. గాలి తరంగాలతో చిరుకొమ్మలు, రెమ్మలు కబుర్లాడుతు న్నాయి. చాంబర్‌వైపు ఓ శాఖ... పెద్ద కొమ్మ, కొమ్మ చివరన రెమ్మ, రెమ్మకు పొడగాటి పక్షిగూడు వేళ్లాడుతోంది. గాలి జోలపాట వింటూ ఉయ్యాలలూగుతోంది. గూడు అల్లిక, నిర్మాణం అపురూపం... అద్భుతంగా వుంది.

చాంబర్లో విలేకరులతో సమావేశం సజావుగా సాగింది. విలేకరులంతా వెళ్లిపోయా రు. వెంకటేశం చూపులు చాంబర్ పైకప్పులను తడుముతున్నాయి. ఆలోచన తళుక్కు మంది.

చెట్టుకు వేళ్లాడుతున్న పక్షిగూడు చాంబర్లో వేళ్లాడితే.....! బ్రహ్మాండంగా వుంటుంది. చాంబర్‌కు కొత్త అందమొస్తుంది. దాన్ని ఎక్కడ వేళ్లాడదీస్తే బావుంటుంది? కాస్సేపు మనో నేత్రాల దేవులాట. చాంబర్ మధ్యలో తన టెబుల్‌పైన వేళ్లాడగడ్తే.. అందంగా, కనువిందుగా ఉంటుంది. మంచి పనికి ఆలస్యమెందుకూ? కాలింగ్ బెల్ మోగింది.

"సర్... ఏం కావాలె సార్" అటెండర్ ప్రత్యక్షం.

"నువ్వే కావాలె"

అటెంబర్ నోరు ఆఫీసు గేటులా తెరుచుకుంది.

"నేనిక్కడనే ఉన్నాను గదా సార్"

"అద్సరే, గేటు దగ్గర వేపచెట్టు, చెట్టుకిటువైపు వేళ్లాడుతున్న పిట్టగూడు చూసినావా?"

"చూసిన సార్"

"ఆ గూడును విప్పుకొచ్చి ఈ చాంబర్లో వేళ్లాడదియ్"

పిచ్చి ముదిరిన రోగిని పరీక్షిస్తున్న కొత్త కాంపౌండర్లా అంటెండర్లో అయోమయం, బెదురు చూపులు.

"అదేందీ, ఆ పిట్ట గూడు తెమ్మంటే అట్లా చూస్తున్నవేందీ?"

"ఊహు" ఉలిక్కిపడి సర్దుకున్నాడు అటెండర్. "ఆ పని నాకు రాదు సార్" కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేశాడు.

"తప్పించుకోవాలనా?" చూపుల్లో చురచుర.

"కక....కాద్సార్" భయం వణుకు పుట్టిస్తోంది. "నాకు చెట్టు ఎక్కరాద్సార్. అమ్మతోడు సార్...."

"ఓహో అట్లనా" అయితే అప్పలస్వామిని పిలువ్"



కథా నిలయం శ్రీకాకుళం

అప్పలస్వామి ఆఘమేఘాల మీద పరిగెత్తుకొచ్చాడు. బోనులో ముద్దాయిలా చేతులు కట్టుకునుంచున్నాడు. కొత్తాఫీసరు ఏమి అడుగుతాడో ఏమో ఆయనెలాంటి వాడో ఏమో.... లోపల ఏదో గోకుతోంది.

"అప్పలస్వామి గారూ!"

"అయ్యా"

"ఆ... వేపచెట్టుకు వేళ్లాడ్తున్న పిట్టగూడు చూడండి"

అయ్యగారి పిలుపుకూ, ఆ పిట్టగూడుకూ ఏం సంబంధమో అర్థం కాలేదు.

"చూసినసార్"

"అది చాలా బాగుంది. కదూ"

"అవును. అది మనుషులు కట్టింది కాదుగదా సార్"

"యూ ఆర్ రైట్. మోసాలు, ద్వేషాలు మనుషులకే పరిమితం. కల్తీ కట్టడాలు పక్షులకు తెలియవు"

"అవున్సార్"

"ఆ పిట్ట గూడును ఈ చాంబర్లో అలంకరిస్తే ఎట్లుంటుంది?"

అంతేనా! నెత్తిమీంచి ఓ క్వింటాల్ బరువు దిగిపోయినట్టు అప్పలస్వామి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. మొహం విచ్చుకుంది

"చాలా బాగుంటుంది. గుడ్ ఐడియా సర్"

"వెరీగుడ్, ఆ పని వెంటనే చేయించండి"

నెత్తిమీద పిట్టగూడు పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు. "నాకు చెట్టెక్కడం రాదుసార్"

"మీకు రాకపోతే వచ్చిన వాళ్లను ఎక్కించండి" ఆదేశం.

ఆఫీసు సిబ్బంది నందరినీ అడిగాడు అప్పలస్వామి. చెట్టెక్కడం ఎవ్వరికీ రాదన్నారు. అదేసంగతి ఆఫీసర్ గారికి సవినయంగా మనవి చేసుకున్నాడు. వెంకటేశంకు ఆశ్చర్యమనిపించింది.

ఇంత పెద్దాఫీసు, ఇంతమంది ఉద్యోగులు... డిగ్రీలు, పీజీలు పాసైన వారున్నారు. ఆఫ్టరాల్.. ఆ పిట్టగూడును తీసుకొచ్చే వారెవ్వరూ లేరా.. ఛ ఛ.... ఏం చదువులో ఏమో.

తను మాత్రం? వీపుమీద కొరడా దెబ్బ పడ్డట్టని పించింది.

"మరెట్లా అప్పలస్వామిగారూ?" పట్టుదల పెరిగిపోతోంది. "ఇక అది అసాధ్య మేనా?" గొంతులో ఆందోళన ఛాయలు.

"మనకది అసాధ్యమే కాని పల్లెటూరు వాళ్లకది సాధ్యమే సార్"

చిమ్మచీకట్లో చిరుదివ్వె వెలిగినట్టైంది. "అయితే మరింకేం. చెట్టెక్కే ఎక్స్‌పర్ట్‌ను పిలిపించండి. రేప్పొద్దున చేయించండి"

"ఓకే సర్" అని మాటైతే జారాడుగాని దరి దొరకని బావిలో దూకినట్టుంది. ఆఫీసరు కిచ్చిన మాట నీళ్లమూటైతే... ఆఫీసులో తన పరిస్థితి అధ్వాన్నమైపోతుంది. బుర్రచించి చాలా సేపు ఆలోచనకు పదును పెట్టాడు. ఎందుకైనా మంచిదని ఇద్దరు అటెండర్లనాదేశించాడు. 'చెట్టెక్కేవాణ్ని రేప్పొద్దున తీసుకురాకపోతే ఇంక్రిమెంట్లు కట్, నాకు ప్రమోషన్ ఫట్" హెచ్చరించాడు.

సాయంత్రం శ్రీమతి అందించిన గరంచాయ్ నరాల్లో పాకుతోంది. ఒంటిలో వేడి పుట్టిస్తోంది. చెట్టంత మనిషిని, ప్రయత్నిస్తే చెట్టెక్కే మనిషేమిటీ, గుట్టలెక్కే మనిషికూడా తొరికి తీరుతాడు.. ధైర్యం.

కాలికి బలపం కట్టుకుని తిరుగుతూ కనబడిన వాళ్లందరినీ అడిగాడు. పెదవి విరుపులు తప్ప పంజేసి పెట్టేవాళ్లు దొరకలేదు. ఇహ లాభం లేదని అదే అటెండర్ల ఇళ్లకెళ్లి మరోసారి గుర్తుచేసి బతిమాలడు.

"మీరు బేఫికర్ గుండుండ్రిసార్. వీడూ నేను కలిసి రేప్పొద్దున తప్పక పట్టుకొస్తం" సీనియర్ అటెండర్ హామీ లభించింది.

అటెండర్లిద్దరు హటాహుటిని బయలుదేరి ఆఫీసు స్వీపరు నాశ్రయించారు.

ఉదయం.. ఆఫీసు టైంకు ఠంచన్‌గా చాంబర్లో ఉన్నాడు వెంకటేశం. గుడిసెల ఫైలు టేబుల్ మీదుంది రెడీగా.

అప్పలస్వామి, అతని వెంట ఇద్దరు అటెండర్లు, మధ్యన ఆఫీసు స్వీపరు. అతని వెనకో పల్లెటూరు మనిషి ప్రత్యక్ష మయ్యారు.

"సార్! ఇతని పేరు ఐలయ్య. చెట్లెక్కడంలో ఎక్స్‌పర్ట్" పల్లెటూరు మనిషిని ముందుకు తోసి పక్కకు తప్పుకున్నాడు అప్పలస్వామి.

నెత్తికి రుమాలు, నల్లని ఒంటిమీద కావిరంగు బనీను, మోకాళ్లదాకా మలిచి కట్టిన ధోవతి.. చూడ ముచ్చటగా ఉన్నాడు ఐలయ్య.

"దండాలు సారూ!" చేతులు జోడించాడు.

"వెరీ నైస్. ఇలా ముందుకు రా ఐలయ్యా" ఆఫీసర్ చిరునవ్వు ఐలయ్యకు ధైర్యమొచ్చింది. అటూ ఇటూ చూస్తూ ముందుకొచ్చాడు. నల్లని బుర్రమీసాల కింద తెల్లని పళ్లు ముత్యాల్లా మెరుస్తున్నాయి.

"చెట్టెక్కి కొమ్మల మీంచి రెమ్మలదాకా వెళ్లగలవా?" గంభీరంగా అడిగాడు వెంకటేశం.

"ఓ.... అదేమన్నా బ్రమ్మవిద్యనా? గట్ల చెట్టెక్కి గిట్ల కోతిపిల్లోలె కొమ్మల మీద ఉరుకులాడుత"

"ఉరుకుడు కాదుగానీ, అదో ఆ వేపచెట్టు కొమ్మ కిటువైపు పిట్టగూడుంది. చూసినవా?" చూపుడు వేలుతో చూపించాడు.

"ఆ...ఆ... చూసిన" అరచేతుల్ని కళ్లమీదుంచుకుని స్పష్టంగాచూశాడు.

"వెరీగుడ్... ఆ చెట్టెక్కి, గా పిట్టగూడు తీసుకొచ్చి మాకియ్యాలె. గూడు ఖరాబు కావద్దు. కూలి ఎంత ఇవ్వుమంటావో అడుగు?"

"అరెరే... గా పిట్టగూడా?" ఐలయ్య కనుబొమలు పీటముడేసుకున్నై.

"అవును. తేలేవా?"

"తేవచ్చు" రూమాలు విప్పి దులిపి భుజమ్మీదేసుకున్నాడు. కనురెప్పలు టపటపలాడినై.

"మరింకేం? పైస లిస్తంగదా"

"ఊహు! పైసలొద్దు."

"అయితే.. ఉత్తపుణ్యానికే తెచ్చిస్తవా?"

"ఊ.. లేద్సార్. ఆ గూడు మీకు... ప్చ్.. కుదరదు"

"అంటే... నువ్వే జబార్లో అమ్ముకుంటవా?"

"అదికాదు సారూ!" తల గోక్కుంటున్నాడు.

అప్పలస్వామి, అటెండర్లు విస్తుబోయారు. స్వీపరు, సిబ్బంది సస్పెన్స్ సినిమా చూస్తున్నట్టు గందరగోళంలో పడిపోయారు.

"అదికాదు ఐలయ్యా!"

ఐఏఎస్ వెంకటేశం అమాంతం కుర్చీ దిగొచ్చి ఐలయ్య భుజమ్మీద చెయ్యేశాడు. "ఆ పిట్టగూడును మేము పారెయ్యము. ఇగో... ఇక్కడ వేళ్లాడదీస్తము. ఆఫీసుకు అందమొస్తుంది గదా!" సముదాయింపుకు దిగాడు.

"అది నిజమే కానీ సారూ! మన ఇల్లును ఎవలన్నా కూలగొడితే మనకెంత ఏడుపొస్తదీ?"

"ఏహె!" మొహం చిట్లించాడు "మనిల్లు సంగతి గాదు, గా గూడు సంగతి చెప్పుమంటే..."

"గదే సారూ! మీరు సదుకున్నోళ్లు. నాకు సదువురాదు. కాని ఒక్క ముచ్చటసారూ!"

"ఏందా ముచ్చట?"

"పాపం గా గూడు కట్టుకునేతందుకు ఆ పిట్ట ఎన్ని రోజులు కష్టపడ్డదో. ఎక్కడెక్క న్నుంచో ఒక్కొక్క గడ్డిపోచ ముక్కుతోని దెచ్చి దాన్ని కట్టుకున్నది. రోజూ రాత్రికి మొగపిట్టతోని దాంట్లనే సంసారం జేస్తుంది. గుడ్లు పెట్టి పిల్లల జేస్తుంది. రెక్కలు వచ్చీ రాని పిట్టపిల్లలు దాంట్లనే ఉంటాయి.. ఆ గూడును నేను పీక్కొస్తే.. ఆ పిట్ట, దాని పిల్లలు ఆగమైపోతై. వాటి గోస మనకు తలుగుద్ది. దండం. బెద్త... గా పాపం పని మనకొద్దు బాంచెన్."

వెంకటేశం బుర్ర గిర్రుమంది. వెన్నుపూసలో సంభ్రమాశ్చర్యాలు.. బతుకు పుస్తకంలోంచి ఓ పాఠం చెబుతున్న గురువులా కన్పించాడు ఐలయ్య.

"అరేయ్, ఐలిగా!" అప్పలస్వామిలో ఆవేశం కట్టలు తెంచుకుంది. బఠాణీలు నములుతున్నట్టు పళ్లు పటపట లాడిస్తూ ముందుకు రాబోయాడు.

"ఆగండి అప్పలస్వామిగారూ" అంటూ వెంకటేశం తిరిగి తన సీట్లో కూర్చున్నాడు. మలినం తొలగిన మనసులో శుభ్రజ్యోత్స్న పరుచుకుంది.

"ఆ పిట్టగూడును అక్కడనే, ఆ చెట్టుకే ఉండనిద్దాం. ఆఫీసు ముందున్న గుడిశెలు అలాగే ఉండనీ. వాటి జోలి మనకొద్దు" అంటూ గుడిశెల ఫైల్లో ఏదో రాసి అప్పలస్వామికి అందించాడు.

ఫైలందుకుంటూ అప్పలస్వామి ఆలోచనలో పడిపోయాడు.

**నవ్య 16-03-2005**

* * * *

